క్లుప్తంగా

సన్మానం



జనగామ రూరల్: ఇటీవల కలెక్టర్ రిజ్వాన్ బాషా చేతులమీదుగా ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకున్న ధర్మకంచ కళాశాల లెక్చరర్ మహ్మద్ అఫ్జల్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ పావని, తోటి అధ్యాపకులు ఘనంగా సన్మించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. వస్కుల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో టి. డేవిడ్ మృతి చెందాడు. కాగా సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు. మల్గ సిద్దిరాములు, రఘుపతి, శ్రీకాంత్, సత్తయ్య, భాస్కర్, యాదగిరి, రామయ్య, సుధాకర్, నాగులు, జగతి, ఐలయ్య, భిక్షపతి ఉన్నారు.

'రైతులను మోసం చేసిన సర్కారు'

రఘునాథపల్లి: ఒకే దఫాలో రైతులందరికీ రూ.2 లక్షల చొప్పున పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కాక అరకొరగా మాఫీ చేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని బ్యాంకుల వద్ద రైతులకు మద్దతుగా చేపట్టనున్న ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

'కొర్రీలు పెట్టొద్దు'

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీలకు కొర్రీలు పెట్టడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనగామలో నేడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వడ్డెపల్లి మల్లారెడ్డి, కనుకయ్య, ఉపేందర్‌రెడ్డి, షబ్బీర్, నరేందర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రామకోటి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. దుంపలి సంపత్, కమ్మగాని శ్రీకాంత్,నిరంజన్ రెడ్డి, సోమేశ్వర్, దేవరాజ్, సంతోష్, రాజు, హరిలాలు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచ్చేటి చంద్రశేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌రావు క్లస్టర్ల వారీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. చిక్కుడు శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, జ్యోతి శ్రీహరి, మంగు జయప్రకాష్, తాళ్లపెల్లి హేమలత, వీరమళ్ల బాబయ్య, చిదురాల రమేష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



దేవరుప్పుల: ఏడాది కిందట కామారెడ్డి గూడేనికి చెందిన బాధితుడు పులిపంపుల సురేష్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా స్వాధీనం చేసుకుని బుధవారం అతనికి ఎస్సై ఊర సృజన్‌కుమార్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగదారులు ప్రభుత్వ ఆమోదిత కంపెనీకి చెందిన తగు ధ్రువీకరణ పత్రాలతో కొనుగోలు చేస్తే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసు శాఖ పరంగా అందివ్వగలుగుతామని అన్నారు. ఏఎస్సై సదానందం, కానిస్టేబుల్ యాకుబ్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎంపీ కవిత, పాస్టర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజవకర్గంలోని వివిధ మండలాలకు చెందిన పాస్టర్ల ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్యకు ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమాన్ని ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ముందుగా మండలంలోని శివునిపల్లిలో నూతన చర్చి దర్వాజ పూజ కార్యక్రమానికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేఆర్ గార్డెన్స్‌లో పాస్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రిస్టియానిటీ అంటే జీవిత విధానాన్ని నేర్పించే మార్గమని, క్రిస్టియన్లు, పాస్టర్లు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. ఒకే వేదికపై నేను ఎమ్మెల్యేగా, నా కుమార్తె కావ్య ఎంపీగా ఉండటం సంతోషమని, అయితే ఆ దేవుడి దీవెనలు, ప్రజల ఆశీర్వాదంతోనే ఈ అవకాశం కలిగిందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో పాస్టర్లకు కమ్యూనిటీ హాల్, పాస్టర్లకు గౌరవవేతనాలు అందించడం, చర్చిల నిర్మాణాలు, ప్రహరీలు, అనుమతులు, పాస్టర్లకు ప్రభుత్వ ఇళ్లు తదితర వినతులు మా దృష్టికి తీసుకువచ్చారని, త్వరితగతిన వాటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి పదిహేను ఏళ్లుగా పట్టిన చీడపీడ తొలగిపోయిందని, ప్రస్తుతం మాట ఇస్తే తప్పకుండా చెప్పిన పని చేసి చూపించే నేత కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గ సమస్యల్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కరించేలా శాయశక్తులా కృషి చేస్తానని ఆమె అన్నారు. అనంతరం నియోజవకర్గ పాస్టర్లు ఎంపీ, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, బూర్ల శంకర్, గన్ను నర్సింహులు, కిషన్‌రాజ్, చింత జాకబ్, ఫాదర్లు, పాస్టర్లు చేపూరి వినోద్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీలు లేక రోడ్డుపైనే వర్షపు నీరు



ఇప్పగూడెం గ్రామంలోని 3, 4వ వార్డుల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగు, వర్షపునీరు రోడ్లపై నిలుస్తుండగా ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

-స్టేషన్‌ఘన్‌పూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : టి.శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్: 8374516716

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్

● సీజేఐటీ కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ: క్రమశిక్షణతో బంగారు భవిష్యత్ సాధ్యమని, విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల(సీజేఐటీ) డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం సీజేఐటీలో బీటెక్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కళాశాలలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజం గర్వించే ఇంజనీర్లుగా ఎదగాలని, కళాశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని దేశ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. బైట్ ఎక్స్ఎల్ ఇన్‌స్టిట్యూట్ అధినేత ఎల్.నిశాంత్ ఆధ్వర్యాన పలు అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలను ఎలా పెంచి పెద్ద చేయాలనే విషయమై తల్లిదండ్రులకు చిట్కాలను నేర్పించారు.

పాఠశాలకు క్రీడా పరికరాల బహూకరణ



క్రీడా పరికరాలు అందజేస్తున్న దాతలు

రఘునాథపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలకు తల్లిదండ్రులు రేగుల అనసూర్యమ్మ-కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బుధవారం క్రీడా పరికరాలు బహూకరించారు. ఈ సందర్భంగా అనసూర్యమ్మ-కృష్ణారెడ్డిల కుమారులు సంపత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, స్వామిరెడ్డి, నగేష్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామ ప్రభుత్వ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. క్రీడా పరికరాలు అందజేయడంపై దాతలను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవిమధు, మాజీ ఉప సర్పంచ్ గంపల కుమార్, హెచ్ఎం గౌరీశ్వర్, ఉపాధ్యాయులు సంపత్, సందీప్, కారోబార్ అఖిల్, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, గ్రామ పెద్దలు గంపల సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేపట్టాలి



ఏఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: బ్యాంకర్లు ఎలాంటి షరతులు లేకుండా రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అనేక మంది రైతులకు కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. రేషన్‌కార్డు అధారంగా రైతుల రుణమాఫీ చేస్తామనడం సరికాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈఓ శిరీషకు అందజేశారు. పెండ్యాల సమ్మయ్య, యాకుబ్‌పాష, గట్టు మల్లు, బుచ్చయ్య, జాఫర్, యాకయ్య రైతులు కాన్సిరాం, నిలాసింగ్, హరిలాల్, సాహెబ్, పంతులు, రతన్‌సింగ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి

లింగాలఘణపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని నెల్లుట్ల హెల్త్ సబ్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల పౌష్టికాహారం, హాజరు వివరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న రూపాచైతన్య

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని టీచర్లు అందించాలని జీపీ కార్యదర్శులు అన్నారు. కొడవటూర్, బండనాగారం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచాలని టీచర్లకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కార్యదర్శులు బ్యాంగి రూపాచైతన్య, భరత్‌కిషోర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నివాళి



రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు బండ కొమురయ్య (64) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పాదల నాగరాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, రాష్ట్ర నాయకుడు బీమగోని చంద్రయ్యలు నాయకులతో కలిసి ఫతేషాపూర్ చేరుకొని మృతదేహంపై ఎర్ర జెండా కప్పి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం గల బండ కొమురయ్య మృతి సీపీఎంకు తీరని లోటన్నారు. సీపీఎం నాయకులు కడారి ఐలయ్య, అరూరి యాదగిరి తదితరులు ఉన్నారు.

పరామర్శ

పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లొంక సోమనర్సయ్య, బక్క బక్కయ్య కుటుంబ సభ్యులను మాజీ మంత్రి దయాకర్‌రావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జఫర్‌గఢ్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని (నేడు) గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మంద కృష్ణను కలిసిన యేసుపాదం

దేవరుప్పుల: ఎస్సీ సామాజికవర్గాల ఆర్థిక అసమానతలు తొలగించేందుకు వర్గీకరణ సాధన కోసం పాటుపడిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగను జిల్లా నాయకుడు పడమటింటి యేసుపాదం హైదరాబాద్‌లో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయడమే ధ్యేయం



కొడకండ్ల: మాట్లాడుతున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం చేయని రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక కారణాలతో అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందని, మండల స్థాయిలో వ్యవసాయాధికారులకు రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రుణమాఫీతో దిమ్మతిరిగిన బీఆర్‌ఎస్ నాయకులు దిక్కుతోచని దుస్థితిలో అర్థంలేని విమర్శలు చేస్తున్నారని, రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన అన్నారు. సోమనర్సయ్య, భిక్షపతి, రమేష్, మనోహర్, వంశీకృష్ణ, శ్రీవర్ధ, కడారి శివరాములు, హరగోపాల్‌గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసం బీఆర్‌ఎస్ ఆరాటం

దేవరుప్పుల: పంట రుణమాఫీని పారదర్శకంగా అమలు పర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే రాజకీయ ఉనికి కోసం బీఆర్‌ఎస్ ఆరాటం మొదలుపెట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, జిల్లా కార్యదర్శులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండుకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాడు వైఎస్సార్ నేడు సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని తూచతప్పకుండా అమలు చేస్తుందన్నారు. పరీదుల భాస్కర్, రామచంద్రునాయక్, రెడ్డిరాజుల రమేష్, బోనగిరి యాకస్వామి, సజ్జన్ నాయక్, , రతన్‌జీ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న రాజన్న

కొడకండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రజినీకాంత్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని కస్తూర్బాలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని 2,373 మంది విద్యార్థులకు 90 పని రోజుల్లో కంటి స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తామని, రాష్ట్ర కమిషనర్ ఆదేశానుసారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాల సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎస్‌ఓ ఈరంటి స్వప్న, ఫార్మాసిస్ట్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామంలో బుధవారం రాత్రి పోచమ్మ, పెద్దమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని పోచమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పొట్లపల్లి శ్రీధర్‌రావు, కేశోజు నిరంజనాచారి, ముక్కెర అశోక్, కేశోజు శాయిచందర్, చిర్ర నాగరాజు, డాక్టర్ సుధాకర్, సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని ఆందోళన చెందొద్దు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ వినయ్‌కుమార్

చిల్పూరు: కొన్ని బ్యాంకుల్లో సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని, అలాంటి వారు ఆందోళన చెందవద్దని ప్రత్యేకాధికారి, ఏఈఓ వినయ్‌కుమార్ నాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని రాజవరం, చిల్పూరు గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి రైతు వేదికల్లో బుధవారం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు, ఆధార్ వివరాలు తప్పుగా పడడం వలన కొందరు రైతులకు రుణమాఫీ వర్తించలేదని, దరఖాస్తుల స్వీకరణ అనంతరం తప్పిదాలను సరిచేసి ఉన్నతాధికారులకు పంపిస్తే రుణమాఫీ వర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు మాచర్ల శ్రీనివాస్ గౌడ్, సట్ల లింగయ్య తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన గంగిరెడ్డి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బుధవారం స్థానిక ఎస్ఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తనవంతుగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో మునిగెల వెంకటేశ్వర్లు, నీల సాంబరాజు, లింగం, రాజు, అశోక్, శ్రీకాంత్, శంబయ్య, శ్రీనివాస్‌తోపాటు తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఏడెల్లి కుమార్(40) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబకలహాలతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరుగగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవాపూర్‌కు చెందిన ఎడెల్లి కుమార్, జ్యోతి దంపతులకు సుప్రియ అనే కుమార్తె ఉంది. కుమార్, జ్యోతి ఇద్దరు కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పేద కుటుంబం కావడంతో మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.1.70 లక్షల అప్పు చేశారు. రోజూ చేసిన కూలీ డబ్బులు కుటుంబ పోషణకు సరిపోవడం, కుమార్ మద్యానికి అలవాటై ప్రతీరోజూ తాగుతుండగా అప్పు తీర్చే మార్గం కనిపించడం లేదు. ఈ నెల 19న రాఖీపండుగ రోజున అప్పుల విషయమై ఇంట్లో భార్యభర్తలకు గొడవ జరిగింది. కుమార్ కోపంతో నువ్వు, నీ కుమార్తె ఇంట్లోంచి వెళ్లిపో అనడంతో జ్యోతి హైదరాబాద్‌కు వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, భార్యతో గొడవతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఈనెల 20న అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, బుధవారం ఉదయం కుమార్ తండ్రి వెంకట్రాములు వారి ఇంటి వద్దకు వెళ్లగా తలుపుగడియ పెట్టి ఉండటంతో కిటికిలో నుంచి చూసి కుమార్ ఉరివేసుకున్న విషయాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. ఇరుగుపొరుగు వారు కుమార్ భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ జి.వేణు ఆదేశాల మేరకు ఏఎస్సై రాజమౌళి సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కుటుంబకలహాలతో..



రాజు (ఫైల్)

నర్మెట: మండలంలోని వెల్దండ గ్రామంలో కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్. నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దండ గ్రామానికి చెందిన కాసర్ల రాజు(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోశించుకుంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో చిన్న చిన్న కలహాలతో మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగగా గమనించిన వారు జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



లింగాలఘణపురం: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై నెల్లుట్ల బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ నుంచి హనుమకొండకు వెళ్తున్న గరుడ బస్సు నెల్లుట్ల బైపాస్ బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే పోలీసుస్టేషన్ -8712685036 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

పాము కాటుకు గురై రిటైర్డ్ హెచ్ఎం..



రామచంద్రా రెడ్డి(ఫైల్)

జనగామ/బచ్చన్నపేట: జనగామ పట్టణం గోకుల్‌నగర్‌కు చెందిన రిటైర్డు హెచ్ఎం ఇమ్మడి రామచంద్రారెడ్డి(68) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 11వ తేదీన ఇంటి వద్ద పాముకాటుకు గురి కాగా, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కాగా, రాంచంద్రారెడ్డి మరణ వార్త తెలుసుకున్న పూర్వ విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చి కడసారి వీడ్కోలు పలికారు.

జీపీలో అవకతవకలపై విచారణ

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ విచారణ చేపట్టారు. అదనపు కలెక్టర్‌తో పాటు విచారణలో పాల్గొన్న డీపీఓ స్వరూపారాణి మాట్లాడారు. గ్రామానికి చెందిన మిన్నాలపురం జలేందర్ జీపీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఇచ్చిన ఫిర్యాదుతో గతంలో విచారణ చేపట్టిన అప్పటి డీపీఓ రంగాచారి తప్పుడు నివేదకను పైఅధికారులకు ఇచ్చారన్న ఫిర్యాదు మేరకు మళ్లీ జీపీ రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన బిల్లులు, గ్రామంలో వసూలు చేసిన ఇంటి, నల్లా పన్నుల రశీదులను తనిఖీ చేశారని చెప్పారు. అవసరమైతే అవకతవకలపై మళ్లీ విచారణ జరుపుతామని అదనపు కలెక్టర్ చెప్పారని ఆమె తెలిపారు. డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓలు మల్లికార్జున్, రఘురామకృష్ణ, జీపీ రూపాచైతన్య పాల్గొన్నారు.

మత్తులో తల్లిదండ్రులను వేధించిన యువకుడు

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్లకు చెందిన ఓ యువకుడు మత్తులో తల్లిదండ్రులను వేధించడమే కాకుండా అటుగా రోడ్డుపై వెళ్తున్న వారిని దూషించడం వంటి చర్యలకు పాల్పడుతుండడంతో సదరు తల్లిదండ్రులు 100 డయల్‌కు కాల్ చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మత్తులో ఉన్న యువకుడిని అదుపులో తీసుకుని విచారించగా గంజాయి తాగినట్లుగా గుర్తించి ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. సదరు యువకుడి ఫోన్ నంబర్ ఆధారంగా కాల్ డాటా సేకరించి మండలంలో ఎక్కడెక్కడ సరఫరా చేస్తున్నారు..? ఎవరు చేస్తున్నారనే విషయాలను తెలుసుకుంటున్నారు. ఈ విషయంపై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను ప్రశ్నించగా విచారణ జరుపుతున్నామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

వ్యక్తి రిమాండ్

దేవరుప్పుల: కల్యాణలక్ష్మి పథకం పొందేందుకు తప్పుడు విధానాలకు పాల్పడిన వ్యక్తిని కోర్టు రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని మాదాపురం రెవెన్యూ పరిధి లాకావత్‌తండాకు చెందిన లకావత్ నంద.. కూతురును సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం నీలిబండ తండాకు చెందిన అంగోత్ నరేందర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. 2022లో నూతన దంపతుల ప్రమేయం లేకుండా వివాహ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి నంద డబ్బులు తీసుకున్నాడని నరేందర్ గత మే నెలలో దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దర్యాప్తు చేసి బుధవారం నందను అరెస్టు చేసి జనగామ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.